క్లుప్తంగా

పోలేరమ్మ హుండీల ఆదాయం లెక్కింపు



కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరులో గల శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ హుండీల లెక్కింపును శనివారం తెనాలి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో బి.సురేష్ బాబు మాట్లాడుతూ ఆరు నెలలకు గానూ రూ.9,33,440 వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో దేవస్థాన ట్రస్టు బోర్డు చైర్మన్ రామినేని కృష్ణవేణి, సభ్యులు మండవ శ్రీను, పి.రమేష్, జి.నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు రామినేని తిరుపతిరావు, భారతీయ స్టేట్ బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు, పూజారులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: చౌడవరంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం హెచ్‌సీఎల్ సంస్థ ప్రాంగణ ఎంపికల్ని నిర్వహించింది. ఇందులో ఎనిమిది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 1037 మంది విద్యార్థులు ఉద్యోగాల్ని పొందారన్నారు. అందులో 121 మంది భారీ ప్యాకేజీ పొందారని చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, టి శ్రీకృష్ణ, సీహెచ్. శ్రీనివాసరావు, జగదీష్ తదితరులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి రూ. 5లక్షల విరాళం

పెదనందిపాడు: మండలంలోని నాగులపాడు శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం (నాగులపాడు పుట్ట)కు చిలకలూరిపేటకు చెందిన ఎ. శివరామాంజనేయకుమార్, సత్య లావణ్య దంపతులు శనివారం విరాళం అందజేశారు. రూ. 5 లక్షల చెక్కును ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సాంబశివరావు, సెక్రటరీ విజయ్‌కుమార్, ట్రెజరర్ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుబ్బారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు స్వామి తీర్థప్రసాదాల్ని అందించి, వారిని అభినందించారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



దుర్గారావు మృతదేహం

పెదనందిపాడు: మద్యం మత్తులో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి పెదనందిపాడులో జరిగింది. ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాతగిరి దుర్గారావు(42) గత కొన్ని రోజులుగా మద్యం ఎక్కువగా తాగుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి మద్యం మత్తులో రామాలయం పక్కన పడుకున్నాడు. ఉదయం స్థానికులు లేపి చూడగా మృతి చెంది ఉండటంతో వీఆర్వో సుధాకరరావు దృష్టికి తెచ్చారు. ఆయన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలియజేశారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఈనెల 16, 17 తేదీలలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ శనివారం ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ విజన్ ఆన్ ఎడ్యుకేషన్ రిఫ్లక్షన్ ఇన్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు కేంద్రం డైరెక్టర్ వై.అశోక్ కుమార్ తెలిపారు. సదస్సులో దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎం.త్రిమూర్తిరావు పాల్గొన్నారు.

మాతృమూర్తులకు పాదాభివందనం

గుంటూరు ఎడ్యుకేషన్: సంపత్‌నగర్‌లోని శ్రీరామకృష్ణ శిశు విద్యామందిరంలో శనివారం మాతృ వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ మాతృమూర్తులకు పాదపూజ చేసి, ఆశీర్వాదం పొందారు. పాఠశాల డైరెక్టర్ శ్రీనాథ్ విద్యార్థులతో అమ్మకు వందనం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు పాతూరి వేంకట రామశాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- జన్మభూమినగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



జన్మభూమి నగర్‌లో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. 40వ డివిజన్ పెదపలకలూరులోని జన్మభూమినగర్‌లో శనివారం కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు సాదర స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్ని వివరించారు. జగనన్న పాలనలో కాలనీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయని తెలిపారు. ప్రతి ఇంటికీ స్థలం, ఇల్లు, అమ్మ ఒడి, వాహన మిత్ర, పెన్షన్లు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా, వంటి పథకాలు అందాయని చెప్పారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు జగనన్న చేసిన కృషికి ప్రజలు నీరాజనం పడుతున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలోనే ప్రతి గడపకు అందాయని వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజల సమస్యలు గ్రామంలోనే పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులు, రోడ్లు, డ్రైన్‌లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలు అందుకుని సంతోషంగా ఉండటం చూసిన చంద్రబాబు, అతని దత్తపుత్రుడు నేడు ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు గత ప్రభుత్వంలో ప్రజలు చేసిన మేలు లేకపోయినా లక్షలాది కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని కొల్లగొట్టాడని సుచరిత ఆరోపించారు. అటువంటి చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బీమినేని వెంకటలక్ష్మి, షేక్ గుల్జార్ బేగం, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, మన్నెం లక్ష్మి, కందుకూరి జ్యోతి, డబ్బూరి సూర్యప్రకాశరావు, తంగెళ్ల నాగేశ్వరరావు, చిలక సుబ్బారావు, వంగా నవీన్ రెడ్డి, ఉద్దగిరి మురళి, కాశీవిశ్వనాథం, ఐలం భాస్కరరావు, వెంకట్, రామకోటేశ్వరరావు, బంగారయ్య, రాజు, తోట నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల్ని విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



ఉత్సవాల వాల్‌పోస్టర్, ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పెదకాకాని: మహా శివరాత్రి పర్వదినం రోజున ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం సకాలంలో కలిగేలా చూడడం ఆలయ అధికారుల బాధ్యతని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తెలిపారు. పెదకాకాని శివాలయంలో ఈనెల 16 నుంచి 22 వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మహా శివరాత్రి రోజున సామాన్య భక్తునికి సైతం సకాలంలో స్వామివారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆలయంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా తరలివచ్చే భక్తుల్నిదృష్టిలో పెట్టుకొని అన్న సంతర్పణ, ప్రసాదాలు పంపిణీ చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణం అంతటా పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. 18వ తేదీ రాత్రి జరిగే స్వామి కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పోలీస్, పంచాయతీ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ అగ్నిమాపక శాఖ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖల సమన్వయంతో మహా శివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని చెప్పారు. ముందుగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు స్వామివారి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.వి. మల్లేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, సర్పంచి గోళ్ల స్వరూప రాణి, సీఐ బండారు సురేష్ బాబు, ఎలక్ట్రికల్ ఏఈ బత్తుల శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

ప్రత్తిపాడు: స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం యువజన సర్వీసుల శాఖ స్టెప్, స్వశక్తి గుంటూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్లు ఎస్. శ్రావణ్‌కుమార్, బి. గణేష్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంతో పాటు కెరీర్ మార్గదర్శకాలు, నాయకత్వ లక్షణాలపై వివరించారు. పదవ తరగతి పూర్తి చేసుకున్న తరువాత ఏ కోర్సులు తీసుకుంటే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుంది, ఏఏ కోర్సుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్న అంశాల్ని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగ మంచుతో అవస్థలు



పెదకాకాని స్టేషన్ సమీపంలో మంచులో లైట్లతో వస్తున్న రైలు బండి

పెదకాకాని: మండలంలో మంచు తీవ్రంగా కురుస్తోంది. పలు గ్రామాలు మంచు దుప్పటి కప్పుకుని కన్పిస్తున్నాయి. సూర్యుడు ఎనిమిది గంటల తరువాత గానీ మంచు తెరల్ని తొలగించుకుని గానీ ఉదయించడం లేదు. జాతీయ రహదారిపై వాహనాలు సైతం తెల్లవారిన తరువాత కూడా లైట్ల వెలుతురులో ప్రయాణాలు సాగిస్తున్నాయి. ఎదర వంద మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించడం లేదు. రోడ్డుపై వాహనాలే కాదు రైళ్లు కూడా లైట్ల వెలుగులో నడుస్తున్నాయి. మహా శివరాత్రి పర్వదినం సమీపిస్తున్నా మంచు విపరీతంగా కురుస్తుండటంతో మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

పాత గుంటూరు: ఆంధ్రా ముస్లిం కళాశాల సమీపంలోని శ్రీ హజరత్ మొహమ్మద్ ఖాశీం అలీషా ఖాదరీ దర్గా 101వ గంధ(సందల్) మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కస్మూర్ దర్గా గాదీనషీన్ సయ్యద్ షబ్బీర్ పీరాముర్షద్ బృందం పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహబూబ్ సుభాని జెండా ఆవిష్కరించారు. కార్యక్రమాలను ధర్మకర్త జనాబ్ మొహమ్మద్ మహమూద్ సాహెబ్, పీఠాధిపతి హజరత్ మొహమ్మద్ మన్సూర అహ్మద్ అలీషా ఖాదరీ అల్ హుసనీ వల్ హుసైనీ, ట్రస్ట్ సభ్యులు షేక్. మీరా బొఖియుద్దీన్ అహ్మద్, షేక్. ఖాజా మొయినుద్దీన్ అహ్మద్ కార్యక్రమాలను నిర్వహించారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

తహసీల్దార్ లీలా సంజీవకుమారి



జగనన్న లేఅవుట్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవకుమారి, ఎంపీడీవో శ్రీరమ్య తదితరులు

ప్రత్తిపాడు: జగనన్న లేఅవుట్‌లో ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తహసీల్దార్ లీలా సంజీవకుమారి తెలిపారు. ప్రత్తిపాడులోని జగనన్న లే అవుట్‌లో శనివారం హౌసింగ్ డే సందర్భంగా లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలలో పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై లబ్ధిదారులతో సమాలోచనలు జరిపారు. వారు చెప్పే సమస్యల్ని సానుకూలంగా విని వాటికి పరిష్కార మార్గాల్ని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంజీవకుమారి మాట్లాడుతూ లే అవుట్స్‌లోని సమస్యల్ని ఎంత ఖర్చు అయినా పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వ బృహత్తర సంకల్పంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఎంపీడీవో శ్రీరమ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతిని కాంక్షిస్తూ సొంత ఇళ్లు లేని వారికి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేసిందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులు ఏమైనా ఉంటే డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా అదనంగా రుణాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సురేష్, వైకేపీ ఏపీఎం సురేష్, పీఆర్ ఏఈ కిశోర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీవోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు



పొంగళ్లను సమర్పిస్తున్న భక్తులు

గుంటూరు రూరల్: నగర శివారు 48వ డివిజన్‌లోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి ఆలయ 11వ బ్రహ్మోత్సవాలు గత మూడు రోజులుగా కమిటీ ఆధర్యంలో నిర్వహిస్తున్నారు. ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామికి గ్రామస్తులు పొంగళ్లను సమర్పించారు. అర్చకులు అభిషేకాలు, పూజలు చేసి స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అనంతరం మహాన్నదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఈదా సాంబిరెడ్డి, అధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డి, కంది సంజీవరెడ్డి, తనబుద్దు శ్రీనివాసరెడ్డి, ఈదా పరసురామిరెడ్డి, పప్పుల వెంకటరెడ్డి, కోటా వెంకటేశ్వరరెడ్డి, పిట్టల శ్రీనివాస్, యర్రసాని రోసిరెడ్డి, కనికిరెడ్డి సీతారామిరెడ్డి, ఈదా కోటిరెడ్డి, పప్పుల రెడ్డమ్మ, భక్తులు పాల్గొన్నారు.

శోభాయమానంగా భవ్య కలశ యాత్ర



కలశ యాత్ర నిర్వహిస్తున్న యువతులు, మహిళలు

ప్రత్తిపాడు: గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో శనివారం సాయంత్రం భవ్యకలశ యాత్ర వైభవంగా నిర్వహించారు. తొలుత గోపూజతో కార్యక్రమాల్ని ప్రారంభించారు. స్థానిక అక్షయ విద్యాలయ ప్రాంగణం నుంచి అంకమ్మగుడి, ఇందిరాగాంధీ బొమ్మ సెంటరు, బస్టాండు మీదుగా గాయత్రి అమ్మవారి చిత్రపటాలతో, 108 పవిత్ర కలశాలతో పెద్దఎత్తున యువతులు, మహిళలు ఊరేగింపుగా యజ్ఞస్థలానికి చేరుకున్నారు. అనంతరం రాత్రి 2400 ప్రమిదలతో దీప మహాయజ్ఞాన్ని నిర్వహించారు.

నేడు మహాయజ్ఞం

స్థానిక అక్షయ స్కూల్ ఆవరణలో ఆదివారం గాయత్రి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మిరియాల సత్యనారాయణబాబు, మండవ ప్రసాద్, చాగంరెడ్డి శివగోవింద్ రెడ్డి చెప్పారు. విశ్వశాంతి, దేశ అరిష్ట నివారణ, వాతావరణ పరిష్కారం, సద్బుద్ధి అలవడటం, లోక కల్యాణం, సుఖశాంతులకు గాయత్రీ మహాయజ్ఞం దోహదం చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా వేదపద్ధతిలో, భారతీయ సంప్రదాయంగా గర్భిణులకు పుంసవన సంస్కారం, నామకరణ సంస్కారం, అక్షరాభ్యాస సంస్కారం, గాయత్రీ మంత్రదీక్షకు గురుదీక్ష, ఉపనయన సంస్కారం, పెళ్లిరోజు సంస్కారం, పుట్టిన రోజు సంస్కారాల్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళల కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ముమ్మరంగా ఈద్గా అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ నజీర్ అహ్మద్

పెదకాకాని: గ్రామంలోని పాతూరు ఈద్గా అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతంలో అనేకసార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నిధులు (ఎంపీ గ్రాంట్స్) రూ. 7 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలు మంజూరయ్యాయి. పంచాయితీరాజ్ అధికారులు పర్యవేక్షణలో వీటతో ఈద్గాకు రెండు వైపులా ప్రహరీ, రెండు వైపుల గేట్లు, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనుల్ని శనివారం ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ నజీర్ అహ్మద్ పరిశీలించారు. ముస్లింలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే విధంగా పనులు చేపట్టిన ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

పొత్తూరి రంగారావుకు ఎక్సలెన్సీ అవార్డు

పాత గుంటూరు: రింగురోడ్డులోని ఒక కల్యాణ వేదికపై రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 ఆధ్వర్యంలో రోటరీ ఉత్తేజం పేరుతో శనివారం రోటరీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన ఆరుగురికి అవార్డుల ప్రదానం చేశారు. కళా రంగం నుంచి గుంటూరుకు చెందిన కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావుకు రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు అందించి ఘనంగా సత్కరించారు. కాన్ఫరెన్స్ చైర్మన్ పీడీజీ డాక్టర్ రవి వడ్లమాని, జిల్లా గవర్నర్ తల్లా రాజశేఖర్ రెడ్డి, కాన్ఫరెన్స్ సెక్రటరీ అనిల్, ఒకేషనల్ డైరెక్టర్ బి.శ్రీనివాస్, పాల్గొన్నారు

కలెక్టరేట్‌లో శ్రమదానం



కలెక్టరేట్‌లో శ్రమదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ

గుంటూరు వెస్ట్: మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మన ఆరోగ్యం బాగుంటుందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో స్వచ్ఛ కలెక్టరేట్‌లో భాగంగా శనివారం శ్రమదానం చేశారు. జేసీ మాట్లాడుతూ ప్రతి శనివారం సాయంత్రం రెండు గంటల పాటు ఆయా కార్యాలయాల ఆవరణలో సిబ్బంది, అధికారులు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. సిబ్బందిగాని, విజిటర్స్‌గాని తినుబండారాలు, వాటర్ బాటిల్స్ ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చూడాలన్నారు. ప్రతి కార్యాలయం వద్ద పరిశుభ్ర వాతావరణం ఉంటే పరిసరాలు కూడా ఆహ్లాదంగా మారతాయని చెప్పారు. కలెక్టరేట్‌లోని పలు ప్రాంతాలను జేసీ స్వయంగా శుభ్రపరచి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత సన్మండలి రజతోత్సవం



పూర్ణ గాయత్రి శివానీని సత్కరిస్తున్న శేషురాణి, కొండా కోటిరెడ్డి, రంగనాయకమ్మ

పాత గుంటూరు: గాయత్రి మహిళా సంగీత సన్మండలి రజతోత్సవ సభ శనివారం వైభవంగా నిర్వహించారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం వేడుకలు నిర్వహించారు. సభలో ముఖ్య అతిథిగా నంబూరు చిట్ ఫండ్ ఎండీ కొండా కోటిరెడ్డి, డాక్టర్ కోగంటి వెంకట శ్రీ రంగనాయకమ్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన విదుషి విష్ణుభొట్ల పూర్ణ గాయత్రీ శివానికి గాయత్రి యువ సంగీత రత్న బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్ణ గాయత్రి వయోలిన్ సోలో శాస్త్రీయ సంగీత కచేరి చేశారు. వీరికి మృదంగంపై కె.అరవింద్, ఘటంపై సరస్వతుల హనుమంతరావు వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమాలను కార్యదర్శి మంగాదేవి, లలిత పర్యవేక్షించారు.

విజ్ఞాన్‌లో ఘనంగా 'వర్టెక్స్'



కార్యక్రమంలో మాట్లాడుతున్న అరవింద్ వారియర్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ కార్యకలాపాలు ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా వర్టెక్స్ (విజ్ఞాన్ ఆన్‌లైన్ రీక్రియేషనల్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషనల్ ఎక్స్‌పీరియన్స్) అనే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన్ ఆన్‌లైన్ ద్వారా బీబీఏ, ఎంబీఏ, బీసీఏ, ఎంసీఏ విభాగాల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం విజ్ఞాన్ ఆన్‌లైన్ ఎక్స్‌పీరియన్స్ అనే ప్లాట్‌ఫామ్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీపుల్ స్ట్రాటజీ, కల్చర్ అండ్ హ్యాపీనెస్ అట్ లిట్మస్ 7 హెడ్ అరవింద్ వారియర్ మాట్లాడుతూ వీవోఎక్స్ వల్ల విద్యార్థులకు ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్‌లతో పాటు ప్రముఖ విద్యా వేత్తల నుంచి గైడెన్స్‌తో కూడిన మెంటర్‌షిప్ పొందే అవకాశం ఉందన్నారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ 21వ శతాబ్దంలో విద్యార్థులు ఉపాధ్యాయుల పైనో, కళాశాలల్లో ఉండే అధ్యాపకుల పైనో ఆధారపడకూడదని, సెల్ఫ్ లెర్నింగ్‌కు నిజమైన భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విజ్ఞాన్ ఆన్‌లైన్ సీఈవో నందిగం శ్రీకాంత్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొంది ఈ- లెర్నింగ్‌లో కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులందరినీ వర్టెక్స్ కార్యక్రమం ద్వారా కలుసుకోవటం సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలు, మారుతున్న పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఎప్పటికప్పుడు టెక్నాలజీలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయులు, వీసీ పి. నాగభూషణ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: సహజీవనం చేస్తున్న మహిళతో వి వాదమై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. నెహ్రూనగర్‌కు చెందిన గోడా కిరణ్‌కుమార్(29) బొంగరాల బీడులో జ్ఞానమ్మ అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. మహిళతో వివాదం ఏర్పడిన నేపథ్యంలో శనివారం ఆమె నివాసంలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

పట్నంబజారు: కట్నం వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. నాయుడుపేటలోని సాకేతపురానికి చెందిన రాగ మౌనిక (28) అదే ప్రాంతానికి చెందిన నాగసతీష్‌తో గత ఏడాది క్రితం వివాహం జరిగింది. ఈక్రమంలో కట్నం సరిపోలేదని భార్యను వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. వేధింపులు తాళలేక మౌనిక శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి తోట నాగశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.